నేడే మునుగోడు ఫలితం

- చౌటుప్పల్ నుంచి మొదలు
- మధ్యాహ్నం ఒంటి గంట వరకు కౌంటింగ్ పూర్తి
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎన్నికల అధికారులు
- మూడంచెల భద్రత ఏర్పాటు



మూడంచెల భద్రత..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అత్యంత ఆసక్తిగా మారిన మునుగోడు ఉపఎన్నిక ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు నల్లగొండ శివారు ఆర్జాలబావి స్టేట్‌వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ, కౌంటింగ్ హాల్లో వసతుల కల్పన పూర్తయ్యాయి. ఒకే హాల్‌లో 21 టేబుళ్లపై 15 రౌండ్లలో లెక్కింపు చేపట్టనున్నారు. ఉదయం 8 గంటలకు మొదలయ్యే కౌంటింగ్ మధ్యాహ్నం ఒంటి గంటలోపు పూర్తి కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం జరిగిన ఉప ఎన్నికలో మొత్తం 2,41,855 ఓట్లకుగాను 2,25,192 ఓట్లు (93.16శాతం) పోలయ్యాయి.

ఇది రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక ఓటింగ్ శాతంగా నిలిచింది. మునుగోడులో 2014లో జరిగిన ఎన్నికల్లో 82.14 శాతం, 2018లో జరిగిన ఎన్నికల్లో 91.30శాతం ఓటింగ్ నమోదైంది. ఈ ఉపఎన్నికల్లో 93.13 శాతంగా నమోదై గత రికార్డులను తిరగరాసింది. ఈ క్రమంలో అందరి దృష్టి మునుగోడు ఉపఎన్నికల ఫలితాలపై ఉంది. ప్రధానంగా టిఆర్ఎస్, బిజెపి గెలుపు తమదంటే, తమదేనంటూ ధీమాతో ఉన్నాయి. ఓటరు తీర్పు ఎలా ఉండేది మరికొద్ది గంటల్లో తెలిసిపోతుంది.

తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

పోలింగ్ ముగిసిన అనంతరం ఇవిఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపర్చారు. వీటి వద్ద రాష్ట్ర, కేంద్ర పోలీసు బలగాలు పహారా కాస్తున్నాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి నేతృత్వంలో లెక్కింపు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ టేబుళ్ల వద్ద అభ్యర్థులు లేదా పార్టీ ఏజెంట్లు కూర్చోవడానికి అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 8 గంటలకు అభ్యర్థులు లేదా ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లు తెరుస్తారు. తొలుత ఆర్వో టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. అనంతరం ఇవిఎంలలో ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఏడు మండలాల్లో మొత్తం 298 పోలింగ్ కేంద్రాల్లో 298 ఈవీఎంలను వినియోగించారు. గంటకు 3 నుంచి 4 రౌండ్ల ఫలితాలు వెల్లడి కానుండగా, మధ్యాహ్నం ఒంటి గంటకల్లా కౌంటింగ్ పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జిల్లా ఎన్నికల అధికారి వినయ్‌కృష్ణారెడ్డి, రిటర్నింగ్ అధికారి రోహిత్‌సింగ్‌తోపాటు కేంద్రం నుంచి వచ్చిన ముగ్గురు పరిశీలకుల పర్యవేక్షణలో కౌంటింగ్ కొనసాగనున్నది. లెక్కింపు నేపథ్యంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద సిఆర్‌పిఎఫ్ బలగాలతో పటిష్ట భద్రత ఏర్పాటు చేయగా, 24 గంటల పాటు సిసి కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతుంది.

చౌటుప్పల్ నుంచి మొదలు..

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో తొలి రౌండ్ చౌటుప్పల్ మండలం నుంచి మొదలు కానున్నది. నారాయణపురం, మునుగోడు, చండూరు, మర్రిగూడెం, నాంపల్లి, గట్టుప్పల్ మండలాల లెక్కింపు జరగనున్నది. ఒక్కో రౌండ్‌లో 21 పోలింగ్ కేంద్రాల చొప్పున కౌంటింగ్ చేపడుతారు.

మండలాల వారీగా నమోదైన పోలింగ్ శాతం

చౌటుప్పల్ 93.75శాతం, నారాయణపురం 93.76, చండూరు 93.51, గట్టుప్పల్92.61, మర్రిగూడ 91.41, మునుగోడు 93.50, నాంపల్లి 92.37 శాతం పోలింగ్ నమోదైంది.

అల్పాహారంలో పురుగులు

- 49 మంది విద్యార్థులకు అస్వస్థత
- కస్తూర్బా బాలికల వసతి గృహంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థినులకు అల్పాహారంగా పెట్టిన అటుకులలో పురుగులున్నప్పటికీ అలాగే వడ్డించడంతో.. అది తిన్న 49 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో 15 మందికి పరిస్థితి ఇబ్బందిగా ఉండడంతో ఆస్పత్రికి తరలించారు. మిగతా వారికి పాఠశాలలోనే ప్రాథమిక చికిత్స అందజేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని కస్తూర్బా బాలికల వసతి గృహంలో శనివారం జరిగింది. విద్యార్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం టిఫిన్‌గా అటుకులను విద్యార్థినులకు పెట్టారు. అటుకులలో పురుగులు రావడంతో.. విద్యార్థినులు నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ అవే అటుకులను వడ్డించారు. ఆ అటుకులు తిన్న 49 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అందులో 15 మంది విరేచనాలు, కడుపు నొప్పితో బాధపడడంతో వెంటనే ఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మిగిలిన విద్యార్థినులకు డిఅండ్‌హెచ్ఒ, ఆర్‌డిఒ ఆదేశాలతో పాఠశాలలోనే చికిత్స అందిస్తున్నారు. విద్యార్థినులను ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఆస్పత్రిలో పరామర్శించారు.



అపోలో వెర్టిగో అండ్ బ్యాలెన్స్ డిజార్డర్ క్లినిక్ ప్రారంభం

హైదరాబాద్ : అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్‌లోని తన ఆసుపత్రిలో శనివారం వెర్టిగో అండ్ బ్యాలెన్స్ డిజార్డర్ క్లినిక్‌ను ప్రారంభించింది. ప్రపంచ వ్యాప్తంగా గుర్తించబడని సమస్యల్లో ఒకటిగా ఉన్న ఈ వ్యాధికి, దేశంలోనే వెర్టిగోను గుర్తించి, చికిత్సను అందించే విధానంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చేందుకు ఈ క్లినిక్ ఉద్దేశించబడిందని అపోలో ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి పేర్కొన్నారు. "కొత్త అపోలో వెర్టిగో అండ్ బ్యాలెన్స్ డిజార్డర్ క్లినిక్ భారతదేశంలో ఉన్న రోగులకు ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణను అందించడానికి అపోలో నిబద్ధతకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది. వెర్టిగో, సమతుల్య రుగ్మతలను గుర్తించడం, నిర్వహించడం కోసం అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో ఇదే తొలి క్లినిక్. వెర్టిగో అండ్ బ్యాలెన్స్ డిజార్డర్స్ సాధారణ జనాభాలో 15 నుండి 30 శాతం మందిపై, 65 సంవత్సరాలు పైబడిన వారిలో 50 శాతం మందిపై ప్రభావం చూపుతాయి. ఈ క్లినిక్ అలాంటి సమస్యను పరిష్కరించి రోగులు ఎలాంటి భయాందోళమలకు గురికాకుండా వారు సాధారణ జీవితాన్ని గడపడానికి సరైన రోగనిర్ధారణ, చికిత్సను అందించడంలో సహాయపడుతుంది." అని ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు.



పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- బిక్కి అధ్యక్షులు చేరాల నారాయణ
- లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

సామాన్య ప్రజలను, వెనుకబడిన వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బిక్కి)ని ఏర్పాటు చేశామని ఆ సంస్థ అధ్యక్షులు చేరాల నారాయణ తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలుగా అండగా నిలువాలని నిర్దేశించుకున్నామన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన బిక్కి సంస్థ స్థాపన, లోగో ఆవిష్కరణకు సీనియర్ ఐఎఎస్ అధికారి పరికిపండ్ల నరహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, ఎంఎస్ఎంఇల స్థాపన, సబ్సిడీలు, రుణాలను యువత అందిపుచ్చుకోవాలని నరహరి సూచించారు. ఈ సమావేశంలో బిక్కి సెక్రటరీ కిరణ్ దాసరి, బిక్కి ప్రతినిధులు పాల్గొన్నారు.



పుస్తక పఠనంతో విజ్ఞానం

- ఆర్‌టిసి ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలు పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన చేసుకోవాలని ఆర్‌టిసి ఛైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సూచించారు. నవతెలంగాణ బుక్‌హౌస్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆర్‌టిసి ఆర్ఎం ఉషాదేవి, మేయర్ దండు నీతు కిరణ్‌తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో బుక్ స్టాల్ ఏర్పాటు చేయడంపై నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్ బాధ్యులను అభినందించారు. ఈ బుక్‌స్టాల్ ప్రజల ఆదరణ చూరగొని మంచిగా నడిస్తే.. దుకాణ కేటాయింపు కాలపరిమితి పొడిగిస్తామని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఈ బుక్‌స్టాల్ ఏర్పాటు చేయడం వల్ల సాహిత్య ప్రియులకు, పుస్తక పాఠకులకు మంచి అవకాశం లభించిందని చెప్పారు. ప్రజలు సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పుస్తక ప్రదర్శనశాలలోని పుస్తకాలను పరిశీలించారు. ఇక్కడ చూస్తుంటే అన్ని రకాల పుస్తకాలు చదవాలనిపిస్తున్నట్టు తెలిపారు. పోటీ పరీక్షలతో పాటు చారిత్రక, నవలలు, కథల పుస్తకాలు, చిన్న పిల్లలు మొదలు.. యవతకు, పెద్దవారికి ఇలా అందరికీ ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ వాసు తెలిపారు. పుస్తక మిత్ర కార్డు తీసుకుంటే 20 నుంచి 30 శాతం వరకు డిస్కౌంట్ ఉంటుందని తెలిపారు. బస్టాండ్‌లో పుస్తక ప్రదర్శనను సాహితీవేత్తలు, పుస్తక ప్రియులు సందర్శించి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు బాజిరెడ్డి జగన్, ఐడిసిఎంఎస్ ఛైర్మన్ సాంబారి మోహన్, నిజామాబాద్ 1, 2 డిపో మేనేజర్లు, ఇందల్‌వాయి ఎంపిపి బదావత్ రమేశ్ నాయక్, బుక్‌హౌజ్ మేనేజర్ కృష్ణారెడ్డి, నవతెలంగాణ రీజియన్ మేనేజర్ సురేశ్, స్టాఫర్ భాస్కర్, బుక్‌హౌస్ బ్రాంచ్ ఇన్‌చార్జి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం గురించి కెసిఆర్ మాట్లాడడం హాస్యాస్పదం

- ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇతర పార్టీల గుర్తులపై గెలిచిన వారికి మంత్రి పదవులు ఇచ్చిన సిఎం కెసిఆర్ బిజెపిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఆ పార్టీ నేత ఈటల రాజేందర్ అన్నారు. ఇదెక్కడి ప్రజాస్వామ్యమని నిలదీశారు. శనివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కెసిఆర్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే విడ్డూరంగా ఉందని అన్నారు. దేశం అధోగతి పాలవుతుందంటూ ఆయన మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఆయన వ్యక్తం చేసిన అదే బాధను తెలంగాణలో తాము అనుభవిస్తున్నామని చెప్పారు. కెసిఆర్ హయాంలో ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ఖూనీ చేశారని అన్నారు. లక్షలాది మంది ఉద్యమంలో పాల్గొని, వేల మంది ప్రాణాలు అర్పిస్తే రాష్ట్రం ఏర్పాటైందన్నారు.

25న పార్లమెంట్ మార్చ్

- ఉపాధి కల్పనలో మోడీ సర్కారు విఫలం
- పోస్టర్ ఆవిష్కరణలో ఎఐవైఎఫ్ నేతల విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్య, ఉపాధి హక్కుల సాధన కోసం ఈ నెల 25న "పార్లమెంట్ మార్చ్"ను నిర్వహించనున్నట్టు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఉన్న అమృతా ఎస్టేట్స్‌లో సంబంధిత పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను కల్పించడంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విఫలమైందని వారు విమర్శించారు. కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశాన్ని పాలిస్తూ యువతను గాలికొదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేసిందనీ, ఇతర పరిశ్రమలను మూసేసిందనీ, దీంతో కోట్లాది మంది యువత ఉపాధిని కోల్పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ఎన్నికల మ్యానిఫెస్టోలో దేశవ్యాప్తంగా నిరుద్యోగులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

ఆ హామీని ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనీ, భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలనీ, నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు సురేష్, శంకర్, లింగం రవి, యుగంధర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్ బాలకృష్ణ, సత్యప్రసాద్, లక్ష్మణ్, రామకృష్ణ, శ్రీనివాస్, మానస్ కుమార్, మహేందర్, మొగిలి లక్ష్మణ్, మహేష్, శ్రీనాథ్‌రెడ్డి, భూక్య రామకృష్ణ, సూర్య, రాజ్ కుమార్, విజయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులను రూపుమాపాలి

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీజెల్స్, రుబెల్లా (తట్టు, అమ్మవారు) తదితర అంటు వ్యాధులను రూపుమాపాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు అలాంటి కేసులను వెంటనే గుర్తించి, చికిత్సనందించి నివారించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆశాలు, ఎఎన్ఎంల పనితీరుపై నెలవారీ సమీక్షలో భాగంగా శనివారం ఆయన హైదరాబాద్ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల నూతన భవన నిర్మాణాలు, మరమ్మతుల కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నట్టు తెలిపారు. అత్యల్పంగా ఓపీ నమోదవుతున్న జిల్లాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫారం (ఐహెచ్ఐపి)లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలనీ, ఈ ప్రక్రియను పూర్తి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తున్నదని హెచ్చరించారు. టిబి బాధితులకు మద్దతు ఇచ్చేందుకు వీలుగా దాతలను ఆహ్వానించాలని, నిక్షయ్ మిత్రగా నమోదు చేయించేందుకు జిల్లా వైద్యాధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేతా మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు గడువును పొడిగించాలి

- సిఇఒకు సిపిఎస్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమంగా నమోదైన ఓట్లను అరికట్టాలని సిపిఎస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఓటర్ల నమోదు గడువు తేదీని పొడిగించాలని కోరింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) వికాస్‌రాజ్‌ను శనివారం హైదరాబాద్‌లో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ మందకోడిగా సాగుతున్న నేపథ్యంలో ఉన్నత పాఠశాలల్లో ఉన్న టీచర్లందరికీ ఓటర్ల నమోదు చివరి రోజైన ఈనెల ఏడున ఓడీ సౌకర్యం కల్పించాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన నారాయణపేట్, జోగులాంబ గద్వాల్‌లో పనిచేస్తూ పక్క రాష్ట్రంలో నివాసముంటున్న వారి ఆధార్ ఆధారంగా కాకుండా ఉద్యోగం చేసే సంస్థ ఆధారంగా ఓటు నమోదుకు అవకాశమివ్వాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేటు, కార్పొరేట్ సంస్థల నుంచి నమోదవుతున్న అక్రమ ఓటర్లను అరికట్టాలనీ, అందుకు బాధ్యులైన అధికారులకు సరైన మార్గదర్శకాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిశీలించి ఆదేశాలు జారీ చేస్తామంటూ వికాస్‌రాజ్ హామీ ఇచ్చారని వివరించారు. కార్యక్రమంలో సిపిఎస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రవణ్ కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎస్ నాయకులు

కెజిబివి ఘటనపై విచారణ జరపాలి

- విద్యాశాఖ సంచాలకులకు మంత్రి సబిత ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నారాయణ్‌ఖేడ్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)లో అల్పాహారం వికటించి 35 మంది విద్యార్థులు ఆస్పత్రిపాలైన సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి పాఠశాల విద్యాశాఖ సంచాలకులను ఆదేశించారు. ఈ విషయం తెలిసిన వెంటనే విద్యార్థులు చికిత్స పొందుతున్న నారాయణ్‌ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలంటూ జిల్లా విద్యాశాఖాధికారి (డిఇఒ)ను శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. విద్యార్థులందరూ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యేంత వరకు ఆ ఆస్పత్రిలోనే ఉండి పర్యవేక్షించాలని డిఇఒను ఆదేశించారు.

ఆర్ఎంపి, పిఎంపిలు చట్టవ్యతిరేకులు

- హెచ్ఆర్‌డిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్ఎంపి, పిఎంపిలంతా చట్టవ్యతిరేకులని హెల్త్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డిఎ) తెలిపింది. ఈ మేరకు ఆ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.మహేశ్ కుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ బోర్డు వారిని రిజిస్ట్రేషన్ చేయలేదనీ, ఇప్పటి వరకు ఏ ఒక్కరికి సర్టిఫికెట్ జారీ చేయలేదని తెలిపారు. హైకోర్టు కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 12 వేల మందికి శిక్షణ ఇచ్చేందుకు ఉత్తర్వులు ఇచ్చారని గుర్తు చేశారు. ఆర్ఎంపి, పిఎంపిలు చెబుతున్న దాని ప్రకారం వారి సంఖ్య దాదాపు 50 వేల మందికి పెరగడానికీ, ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేసే అనవసరమైన జిఒ జారీ చేయడమే కారణమని పేర్కొన్నారు. ఆర్ఎంపి, పిఎంపిల్లో కొంత మంది అసోసియేషన్లు పెట్టుకుని ప్రాథమిక విద్యార్హత లేని నిరుద్యోగ యువత సైతం అర్హత కలిగిన వైద్యులుగా ప్రాక్టీస్ చేసుకోవచ్చంటూ ఆకర్షిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారందరికి రూ.50 వేలకు సర్టిఫికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడమే సమస్యకు పరిష్కారమని సూచించారు.

గాన సభ అభివృద్ధికి కళా కృషి ప్రశంసనీయం

- మధుసూధనా చారి

ప్రజాశక్తి - కల్చరల్

త్యాగరాయ గానసభ అభివృద్ధిలో కళా సుబ్బారావు కృషి సంస్మరణీయమని మాజీ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి కొనియాడారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా శనివారం సాంస్కృతిక రంగ ప్రముఖులు, గానసభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా మధుసూదనాచారి పాల్గొని సుబ్బారావు స్మారక పురస్కారం శాసనమండలి సభ్యులు బొగ్గరపు దయానంద్‌కు బహూకరించి మాట్లాడారు. గాన సభ స్థాపకుల్లో కళా సుబ్బారావు ప్రముఖులుగా ఉండి అధ్యక్షుడుగా సంగీత, నాటక, నృత్య భిన్న కళా ప్రక్రియల కళాకారులను ప్రోత్సాహించారని అన్నారు. ఎందరో ప్రసిద్ధ కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేసి గానసభను ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దారని వివరించారు. పురస్కర గ్రహీత దాయానంద్ విద్యావంతులు, కళాభిమాని, సౌమ్యుడు అని అభినందించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ కళా సుబ్బారావు జీవితం చివరి వరకూ గాన సభ ఉన్నతికి కృషి చేశారని, ఆయన వేసిన బాటపై గతంలో తన సోదరుడు దీక్షితులు, ప్రస్తుతం తాను అధ్యక్షులుగా గాన సభ పేరు నిలిపేందుకు అంకిత భావంతో పని చేస్తున్నామని తెలిపారు.



ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) డైరెక్టర్ పివి శ్రీహరి ఒక ప్రకటన విడుదల చేశారు. ఓపెన్ పదో తరగతి పరీక్షలో4,977 (45.44 శాతం) మంది, ఓపెన్ ఇంటర్ పరీక్షలో 4,896 (40.42 శాతం) మంది పాసయ్యారని తెలిపారు. విద్యార్థులు మెమోలను www.telanganaopenschool.org వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ప్రత్యామ్నాయమేది?



- యాసంగిలో యేటా 85 శాతాన్ని మించుతున్న వరి సాగు
- పప్పులు, కూరగాయల సాగు కనుమరుగు
- ఆకాశాన్నంటుతున్న నిత్యవసర దినుసులు, కాయగూరల ధరలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెసలు, కందులు, శనగలు, జొన్నలు, రాగులు, అనుములు, మినుములు, రాగులు.. ఒకప్పుడు యాసంగిలో విరివిరిగా సాగైన పంట చేలు.. ఇప్పుడు కనుమరగయ్యాయి. కనీసం పల్లి చేనూ అక్కడక్కడా అవశేషాలుగానే కనిపిస్తోంది. అందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించకపోవడం ఒక కారణమైతే.. పెరిగిన నీటివనరులతో రైతాంగమంతా వరివైపే మొగ్గుచూపడం మరో కారణం. యాసంగిలో పప్పుదినుసులు వేసుకునే రైతులు మొత్తం సాగు విస్తీర్ణంలో 85 శాతానికిపైగా వరి మాత్రమే వేస్తున్నారు. పర్యవసానంగా నిత్యావసర పప్పుదినుసులు, కూరగాయల ధరలు మార్కెట్‌లో అగ్గిదూకుతున్నాయి. ఏ పప్పు కొందామన్నా.. ప్రస్తుతం కిలో రూ.120కిపైగా వెచ్చిస్తేగానీ దొరకని పరిస్థితి నెలకొంది. ఇక కాయగూరలు స్థానికంగా కనీస సాగు కనుమరుగవడంతో దిగుమతి చేసుకోవాల్సిరావడంతో కిలో రూ.50కిపైగానే ఉంటున్నాయి.

యాసంగిలో 2012 వరకూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు లక్షల ఎకరాలైనా వరి సాగు విస్తీర్ణం లేదు. అదీ ఏకంగా ఏయేటికాయేడు పెరుగుతూ సుమారు పది లక్షల ఎకరాలకు చేరింది. వానాకాలంలోనైతే ఏకంగా 12లక్షల ఎకరాల్లో సాగవుతోంది. పదేళ్ల కిందట వరకూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పత్తి ప్రధాన పంటగా ఉండేది. అందులో అంతరపంటగా కందులు సాగు చేసేవారు. ఇప్పుడు వరి 85 శాతానికిపైగా విస్తీర్ణంలో సాగువుతుండగా.. పత్తి కేవలం పది శాతానికే పరిమితమైంది. మిగిలిన ఐదు శాతం విస్తీర్ణంలోనే మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, పల్లి సాగవుతోంది. ఒకప్పుడు పత్తి అంతరపంటగా సాగైన కంది కనీసంగా 15వేల ఎకరాల్లో ఉంటే ఇప్పుడు వంద ఎకరాలూ దాటని పరిస్థితి నెలకొంది. ఇక శనగ, పెసర పంటలు అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కనీసం వెయ్యి ఎకరాలు దాటలేదు. ఇక కూరగాయల పరిస్థితి చెప్పనక్కర్లేదు.. 2016 వరకూ కాయగూరల సాగు విస్తీర్ణం 15వేల ఎకరాల్లో ఉంటే 2017 నుంచి తగ్గుముఖం పడుతూ వచ్చింది. ఏకంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కనీసం నాలుగు వేల ఎకరాలైనా దాటడం లేదు. ఈ వానాకాలంలో మూడు వేల ఎకరాలకే పరిమితం అయింది.

ప్రభుత్వ ప్రోత్సాహం కనుమరుగు...

గతంలో బిందు, తుంపర సేద్యానికి ప్రోత్సాహకం ఉన్న సమయంలో పప్పుదినుసులు, పల్లి, కూరగాయలు విరివిరిగా సాగయ్యేవి. ఇటు వ్యవసాయం, అటు ఉద్యాన శాఖలు కాయగూరల విత్తనాలకు రాయితీలూ అందిస్తూ ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేవి. ఇప్పుడు కాళేశ్వరం జలాలు అందుబాటులోకి రావడం.. ప్రతియేడూ సమృద్ధిగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు నిండుకుండలా మారడం, చెరువులు, కుంటల్లో నీరు సమృద్ధిగా ఉండటం.. భూగర్భజలాలూ పెరగడం కారణంగా వరి సాగు ఏకంగా 12లక్షల ఎకరాలకు విస్తరించింది. వానాకాలం, యాసంగి సీజన్లలో మొత్తం సాగు విస్తీర్ణంలో 90శాతం వరకూ వరి మాత్రమే వేయడంతో ప్రత్యామ్నాయ పంటలు కనుమరగయ్యాయి. ఫలితంగా నిత్యావసరంగా వాడుకునే పప్పుదినుసులు, కాయగూరల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.



కాంగ్రెస్‌లో కొత్త జోష్

- జోగిపేటలో జోడో యాత్రకు స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు
- చౌటకూర్ నుంచి దానంపల్లి వరకు పాదయాత్ర
- రాహుల్ పాదయాత్ర తెలంగాణ పార్టీకి దిశానిర్దేశం : జైరాం రమేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాహుల్ గాంధీ భారత్‌జోడో యాత్రకు సంగారెడ్డి జిల్లాలో అడుగడుగునా జననీరాజనంతోపాటు కాంగ్రెస్‌లో కొత్త జోష్ వచ్చింది. శనివారం అందోల్ నియోజకవర్గంలోని చౌటకూర్ వద్ద ప్రారంభమైంది. మాజీ డిప్యూటీ సిఎం దామోదర్ రాజనర్సింహ రాహుల్ గాంధీకి స్వాగతం పలికారు. ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన పాదయాత్ర జోగిపేట పట్టణ కేంద్రం మీదుగా దానంపల్లికి చేరుకుంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అల్మాయిపేట్, సంగుపేట్, అందోల్, జోగిపేట, అన్నసాగర్, దానంపల్లి వద్ద కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికారు. పాదయాత్రలో రాహుల్ వెంట రేవంత్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, భట్టి విక్రమార్క, జైరాం రమేష్, మల్లు రవి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, మధుయాష్కీ తదితరులు నడిచారు. దానంపల్లి మీదుగా సాయంత్రం గడి పెద్దాపూర్ వరకు చేరుకుంది.

రెండూ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలే.. : జైరాం రమేష్

పరిపాలన విషయంలో కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కెసిఆర్ సర్కార్‌కు ఎలాంటి తేడా లేదని.. రెండూ ఒకే పట్టాలపై వెళ్లే డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలేనని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్రలో భాగంగా అందోల్ మండలం దానంపల్లి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల నుంచి రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు విశేష స్పందన వస్తోందని, ఇది కాంగ్రెస్ పార్టీలో కొత్త జోష్‌ను తీసుకొచ్చిందని చెప్పారు. ఇప్పటి వరకు తెలంగాణలోని ఏడు జిల్లాల్లో పాదయాత్ర పూర్తైందన్నారు. ఉన్నతమైన లక్ష్యం కోసం రాహుల్ గాంధీ యాత్ర మొదలు పెట్టారన్నారు. రాహుల్ పాదయాత్ర తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్‌కు కొత్త దిశా నిర్దేశం చేస్తుందని తెలిపారు. పాదయాత్రలో భాగంగా రాహుల్ గాంధీ అన్ని వర్గాల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికే వందలాది మంది విద్యార్థులు, కార్మికులు, సామాజికవేత్తలను కలిశారని చెప్పారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ పాదయాత్ర ద్వారా తమకు తెలిసిందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో త్వరలో జరగబోయే ఉప ఎన్నికలకు భారత్ జోడో యాత్రకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఇస్తే పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసి కూడా కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసిందని, ఇది అత్యంత కఠిన నిర్ణయమని చెప్పారు. మునుగోడు ఉప ఎన్నికలో గెలిచేందుకు బిజెపి, టిఆర్‌ఎస్ నాయకులు ఎలాంటి ఆపరేషన్లు నిర్వహించారో అందరికీ తెలుసన్నారు

విద్యార్థులపై పోలీసుల దాడికి ఎస్‌ఎఫ్‌ఐ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హాస్టల్ కేటాయించాలంటూ కోరుతూ ఆందోళన చేసిన నిజాం కళాశాల విద్యార్థులపై పోలీసులు చేసిన దాడిని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాల క్యాంపస్‌లోకి పోలీసులు ప్రవేశించి శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ముఖ్యంగా అమ్మాయిలపై విచక్షణా రహితంగా పోలీసులు దాడి చేయడం దుర్మార్గమని విమర్శించారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయకుండా కళాశాల అధికారులు విద్యార్థులను అరెస్ట్ చేయించడం సిగ్గుచేటని తెలిపారు. అక్రమంగా అరెస్ట్ చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలనీ, వారి సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

డ్రగ్స్ కేసులో సూత్రధారి ఎడ్విన్ అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాదకద్రవ్యాల సరఫరా కేసులో కీలక సూత్రధారిని నార్కోటిక్ పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ సరఫరాలో కీలకంగా వ్యవహరిస్తోన్న ఎడ్విన్‌ను నార్కోటిక్ విభాగం పోలీసులు గోవాలో అదుపులోకి తీసుకున్నారు. గోవా నుంచి హైదరాబాద్‌కు మాదకద్రవ్యాల సరఫరాలో ఎడ్విన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి నారాయణ బోర్కర్ అనే వ్యక్తిని మూడు నెలల క్రితం నార్కోటిక్ విభాగం పోలీసులు అరెస్టు చేశారు. గోవా నుంచి డ్రగ్స్ తీసుకొస్తూ హైదరాబాద్‌లో సరఫరా చేయడంలో నారాయణ బోర్కర్‌ది కీలక పాత్ర. తను ఇచ్చిన సమాచారం మేరకు నార్కోటిక్ విభాగం పోలీసులు గోవాలో పలువురిపై నిఘా పెట్టారు. గత మూడు నెలలుగా ఎడ్విన్ తప్పించుకొని గోవాలో తిరుగుతున్నాడు. పక్కా ప్రణాళికతో 15 రోజులుగా అక్కడే ఉండి స్థానిక పోలీసులు ఎడ్విన్‌పై నిఘా పెట్టారు. ఎట్టకేలకు ఎడ్విన్‌ను పట్టుకున్న హైదరాబాద్ పోలీసులు నేడు నగరానికి తీసుకురానున్నట్లు సమాచారం.

మెరిట్ లేకుండా సీటిస్తే రూ.10 లక్షల జరిమానా

- అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు
- ఇంజినీరింగ్ కాలేజీలకు టిఎఎఫ్‌ఆర్‌సి హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటా కింద ఉన్న సీట్లను మెరిట్ లేకుండా విద్యార్థులకు ఇస్తే రూ.10 లక్షల జరిమానా విధిస్తామని తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులరేటరీ (టిఎఎఫ్‌ఆర్‌సి) హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా సీట్లు కేటాయించినా, అధికంగా ఫీజులు వసూలు చేసినా ఆయా కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో టిఎఎఫ్‌ఆర్‌సి చైర్మన్ జస్టిస్ పి స్వరూప్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, జెఎన్‌టియుహెచ్ విసి కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ ఎం మంజూర్ హుస్సేన్ తదితరులు సమావేశమయ్యారు. రాష్ట్రంలో పలు ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో టిఎఎఫ్‌ఆర్‌సి నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. సిఎస్‌ఇ వంటి కోర్సులకు డొనేషన్ పేరుతో ఎక్కువ ఫీజు తీసుకుంటున్నట్టు వారి దృష్టికి వచ్చింది. దీంతో ఆ కమిటీ సమావేశమై పలు అంశాలపై చర్చించింది. అనంతరం స్వరూప్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. జీవో నెంబర్ 37లో పేర్కొన్న ఫీజు కంటే ఎక్కువ ఫీజు వసూలు చేస్తే, ఒక్కో స్టూడెంట్‌పై రూ.రెండు లక్షల జరిమానా విధిస్తామని తెలిపారు. విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి ఇప్పించనున్నట్టు పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో బి కేటగిరి సీట్లను విద్యార్థులు చేసుకున్న దరఖాస్తులను పట్టించుకోకుండా, మెరిట్ ప్రకారం కాకుండా నిబంధనలకు విరుద్ధంగా సీట్లు కేటాయిస్తే ఒక్కో అడ్మిషన్‌కు రూ.10 లక్షల జరిమానా విధిస్తామని యాజమాన్యాలను హెచ్చరించారు.

టిఆర్‌ఎస్ గెలిస్తే రాజకీయ సన్యాసం చేస్తారా?

- బండి సంజయ్‌కి కూనంనేని సవాల్
- అవినీతికి కేంద్రబిందువు ప్రధాని మోడీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపినే గెలుస్తుందన్న బండి సంజయ్ ఒకవేళ టిఆర్‌ఎస్ గెలిస్తే రాజకీయ అస్త్ర సన్యాసం లేదేంటే ఎంపీ పదవికి రాజీనామా చేస్తారా?అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సవాల్ విసిరారు. సిపిఐ, సిపిఎం మద్దతుతో టిఆర్‌ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఫలితాలు బిజెపికి చెంపపెట్టులాంటిదని అన్నారు. ఒకవేళ ఈ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే సంజయ్‌కి క్షమాపణ చెప్తాననీ, ఆయనకు దండ వేస్తానని అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపిని ఓడించేందుకు చివరి వరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఆ పార్టీని వ్యతిరేకించే ఏ పార్టీతోనైనా కలుస్తామన్నారు. దేశానికే ప్రమాదకరమైన కాషాయ పార్టీని రాష్ట్రంలో ఎదగనివ్వబోమన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో ఓట్ల కోసం బిజెపి డబ్బులు పంచలేదంటూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రమాణం చేస్తారా?అని ప్రశ్నించారు. అప్పుడే ఆయన చేసే ప్రమాణాలకు విలువ ఉన్నట్టు గుర్తిస్తామన్నారు. అవినీతికి కేంద్రబిందువు ప్రధాని మోడీ అని విమర్శించారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో తెలంగాణ పోలీసులకు ధైర్యముంటే ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వరవరరావు, సాయిబాబాపైన కుట్ర కేసులు పెట్టినట్టే, రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్ర చేసిన వారిపైనా కేసులు పెట్టాలని కోరారు. బండి సంజయ్, తరుణ్ చుగ్ దెయ్యం పట్టినట్లు దేవుడి మీద ప్రమాణం చేసి ఇతరులు కూడా అదే చేయాలంటున్నారని చెప్పారు. సిబిఐ, ఇడి, ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థతోపాటు రాజ్యాంగ వ్యవస్థలన్నీ మోడీ ఆధీనంలో పనిచేస్తున్నపుడు ఇక ఎన్నికలు నిర్వహించడమెందుకని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉన్నామా? లేక నిరంకుశ వ్యవస్థలో ఉన్నామా? ఈ దేశాన్ని కార్పొరేట్ శక్తులు పాలిస్తున్నాయా?అనే అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. రాజనీతిజ్ఞుడుగా ఉండాల్సిన ప్రధాని మోడీ ఒక జిల్లా, గ్రామ స్థాయి నాయకునిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయన దిగజారి, దేశ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి చౌకీదార్‌గా ఉంటానన్న మోడీ స్వార్థం, అధికారం కోసం, దేశాన్ని అన్ని రంగాల్లో అపఖ్యాతి పాలు చేస్తున్నారని అన్నారు. బండి సంజయ్ మొండి సంజయ్‌గా మారి పీఠాధిపతులు మాట్లాడిన స్క్రిప్ట్ కెసిఆర్ ఇచ్చారంటూ బుర్ర లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

పెరుగుతున్న వామపక్షాల ప్రాధాన్యత : అజీజ్ పాషా

ప్రపంచ వ్యాప్తంగా లాటిన్ అమెరికా, డెన్మార్క్ లాంటి దేశాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడడం మంచి పరిణామమని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. వామపక్షాల పని అయిపోయిందంటూ చాలామంది దుష్ప్రచారం చేశారనీ, కానీ ప్రస్తుతం వాటి ప్రాధాన్యత రోజు రోజుకూ పెరుగుతున్నదని చెప్పారు. ఇటీవల బ్రెజిల్‌లో లులా డిసిల్వా, డెన్మార్క్ సెంట్రల్ అభ్యర్థి గెలుపే అందుకు నిదర్శనమన్నారు. భారత్‌లో మీడియాపైన ఆంక్షలు, ఒత్తిడి పెరుగుతోందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థలన్నీ బలహీన పునాదులపైన ఉన్నాయనీ, ఇలాంటి పరిస్థితుల్లో న్యాయ వ్యవస్థ ప్రధాన పాత్ర పోషించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో దొంగలెవరో, దొరలెవరో తేలాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పశ్యపద్మ, ఈటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న సాంబశివరావు



26న చలో రాజ్‌భవన్

- జయప్రదానికి ఎస్‌కెఎం పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతాంగ ఉద్యమానికి తలొగ్గిన మోడీ సర్కార్ తమ డిమాండ్ల పరిష్కారానికి హామీనిచ్చిందనీ, అయితే వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) నాయకులు విమర్శించారు. శనివారం హైద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎస్‌కెఎం నాయకులు టి.సాగర్, పశ్య పద్మ, ఉపేందర్‌రెడ్డి, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, మూడ్ శోభన్, సోమిడి శ్రీను, వరికుప్పల వెంకన్న, పెద్దారపు రమేష్ తదితరులు చలో రాజ్‌భవన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు పోరాటానికి రెండేండ్లు పూర్తి కావొస్తున్న సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా నవంబర్ 26న 'చలో రాజ్ భవన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా హామీనిచ్చి అమలు చేయకపోవడం దారుణమని విమర్శించారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధరల కోసం పార్లమెంటులో చట్టం చేయాలనీ, స్వామినాథన్ సిఫార్సుల అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి ఉన్న రుణాలన్నింటినీ ఏకకాలంలో మాఫీ చేయాలన్నారు. రుణ విమోచన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని సవరించి అమలు చేయాలని కోరారు. రైతు ఉద్యమంలో మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖా సహాయమంత్రి అజరుకుమార్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించాలన్నారు. అటవీ సంరక్షణ చట్టం నిబంధనల్లో కేంద్రం చేస్తున్న మార్పులను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు.

19, 20 తేదీల్లో 'భారత్ బచావో' మేధోమధన సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రమాదపుటంచున పడిన భారతదేశాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో 'ఆలోచనాపరుల వేదిక - భారత్ బచావో' నాయకులు డాక్టర్ ఎం.గోపీనాథ్, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు, రిటైర్డ్ టీచర్ సోమన్న, రచయిత స్కైబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు 'భారత్ బచావో ' అనే అంశంపై మేధోమధన సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సదస్సులో మేధావులతోపాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారని చెప్పారు. దేశంలో సమాఖ్య భావన దెబ్బతింటున్నదనీ, రాజ్యాంగ స్ఫూర్తితో పాలన జరగడం లేదనీ, బిజెపి ప్రభుత్వం ఫాసిస్టు ధోరణికి రాష్ట్ర ప్రభుత్వాలు వణికిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సామాజిక, మత సామరస్యతను పరిరక్షించాల్సిన అవసరముందని అభిప్రాయం వ్యక్తం చేశారు. 1933లో జర్మనీ నాజీల వశమైనప్పుడు అక్కడ నెలకొన్న పరిస్థితులే ప్రస్తుతం భారతదేశంలో ఉన్నాయనీ, ఈ స్థితి నుంచి దేశాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లౌకికవాదాన్ని పరిరక్షించేందుకు వచ్చే అన్ని శక్తులను కలుపుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామని తెలిపారు. రాజ్యాంగాన్ని రద్దు చేసే అవకాశం కోసం బిజెపి కాచుకుని కూర్చుందనీ, దాన్ని వ్యతిరేకించే శక్తులన్ని కలిసి రావాలని పిలుపునిచ్చారు.



కొంపల్లిలో క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

కాన్ఫిడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా తన 12వ క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షోను ఏర్పాటు చేసింది. నవంబర్ 5, 6వ తేదీల్లో జరగనున్న ఈ ప్రదర్శనను శనివారం కొంపల్లిలోని ఆస్పిసియస్ కన్వెన్షన్ సెంటర్‌లో లాంఛనంగా ప్రారంభించింది. డెవలపర్లు, కొనుగోలుదారులు అందరినీ ఒకే చోటకు తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఉత్తర హైదరాబాద్‌పై దృష్టి సారించి నిర్వహిస్తోన్న తొలి ప్రాపర్టీ షో అని పేర్కొంది. ఈ ప్రదర్శనను తెలంగాణా రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి, రహదారుల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కెపి వివేకానంద, మేడ్చల్ ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుతో పాటుగా క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు పి రామకష్ణారావు, జనరల్ సెక్రటరీ వి రాజశేఖర్‌రెడ్డి, క్రెడాయ్ తెలంగాణ చైర్మన్ సిహెచ్ రామచంద్రారెడ్డి, అధ్యక్షులు డి మురళి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. "నగర వ్యాప్తంగా జరుగుతున్న అభివద్ధితో పాటుగా పరిశ్రమలు అభివద్ధి చెందుతున్న తీరు కారణంగా గహ, వాణిజ్య రియల్ ఎస్టేట్‌కు డిమాండ్ కూడా గణనీయంగా పెరిగింది. ఈ ప్రోపర్టీ షోను అత్యుత్తమ, అత్యంత విశ్వసనీయమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్స్, మరీ ముఖ్యంగా హైదరాబాద్ ఉత్తర ప్రాంతంపై దష్టి సారించి చేస్తుంది. ఈ ప్రోపర్టీ షోలో అత్యుత్తమ ప్రాజెక్టులు ఉంటాయి." అని రామకృష్ణారావు పేర్కొన్నారు.

న్యాయవిద్యలోనూ ఉద్యోగావకాశాలు


- డిసెంబర్ 18న క్లాట్
- నల్సార్ విసి శ్రీకృష్ణదేవరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)-2023 రాతపరీక్ష డిసెంబర్ 18న నిర్వహిస్తామని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో క్లాట్ పరీక్షకు సంబంధించిన బ్రోచర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1,150 లా కాలేజీలున్నాయని చెప్పారు. వాటిలో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం రెండో ఉన్నతమైన వర్సిటీగా గుర్తింపు పొందిందని వివరించారు. దేశంలోని 22 న్యాయ విశ్వవిద్యాలయాలు కలిసి క్లాట్ పరీక్షను నిర్వహిస్తున్నాయని అన్నారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసేందుకు అర్హులన్నారు. దేశవ్యాప్తంగా మూడు వేల సీట్లున్నాయనీ, అందులో నల్సార్ వర్సిటీలో 140 సీట్లున్నాయని వివరించారు. ఇందులో తెలంగాణ కోటా కింద 25 శాతం సీట్లు కేటాయిస్తామని చెప్పారు. క్లాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 19 వరకు గడువుందన్నారు. 150 మార్కులతో ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నాపత్రం ఉంటుందనీ, నెగెటివ్ మార్కులూ ఉంటాయని అన్నారు. న్యాయ శాస్త్ర విద్యార్థులకు సైతం ఉద్యోగావకాశాలున్నాయని చెప్పారు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాల నేపథ్యంలో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో కార్పొరేట్ రంగంలో అనేక అవకాశాలున్నాయని వివరించారు. ఇంజినీరింగ్, డాక్టర్ వంటి వృత్తి మాత్రమే కాకుండా న్యాయశాస్త్రంలోనూ ఉద్యోగావకాశాలను దృష్టిలో ఉంచుకుని ఇంటర్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వి బాలకిష్టారెడ్డి పాల్గొన్నారు.

బుడ్డగూడెంలో పోడు రగడ..

- పోడు రైతులు, అటవీ శాఖ అధికారుల మధ్య గొడవ
- రైతుల ఆందోళన
- భూములు లాక్కుంటే ప్రతిఘటన తప్పదు : సిపిఎం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని సోంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుడ్డగుడెం గ్రామంలో శనివారం మరోసారి పోడు రగడ మొదలైంది. అటవీశాఖ అధికారులకు, పోడు రైతులకు మధ్య మరోసారి గొడవ నెలకొంది. గ్రామంలోని పోడు రైతులు ఫారెస్ట్ భూముల్లోని మొక్కలను తొలగించారని ఆ శాఖ అధికారులు పెద్దఎత్తున ఆ ప్రాంతంలో మోహరించారు. ఈ సమయంలో పోడు రైతులు.. తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీ శాఖ అధికారులు బలవంతంగా లాక్కుంటున్నారని, తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. దాంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ సమయంలో ఆందోళనలు వద్దని, అటవీ శాఖ కార్యాలయం వద్ద కూర్చొని మాట్లాడుకుందామని కొందరు అధికారులు పేర్కొన్నప్పటికీ పోడు రైతులు ఆ ప్రతిపాదనను తిరస్కరించారు. అదే విధంగా పోడు భూముల్లోని ఎండిపోయిన మొక్కలను తగలబెడదామని రైతులు ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులకు, పోడు రైతులకు స్వల్ప వాగ్వివాదం జరిగింది. పాల్వంచ సిఐ నాగరాజు నేతృత్వంలో బూర్గంపాడు అదనపు ఎస్ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. చివరకు పోడు రైతులు ఆందోళన విరమించారు.

144 సెక్షన్ అమలు

బుడ్డగూడెం గ్రామంలో అటవీశాఖ అధికారులకు, పోడు రైతులకు మధ్య రగులుతున్న వివాదం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసే అవకాశాలు ఉండటంతో ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధిస్తూ జిల్లా కలెక్టర్ అనుదీప్ ఆదేశాలు జారీ చేశారు.

కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు సోంపల్లి పంచాయతీ బీట్ పరిధిలో ఈ నెల 20వ తేదీ వరకు ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని బూర్గంపాడు తహసీల్దార్ భగవాన్ రెడ్డి విలేకరులకు తెలిపారు.

భూములు లాక్కుంటే ప్రతిఘటన : సిపిఎం

పోడు భూముల సర్వేను పూర్తిచేసి తక్షణమే రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. ములకలపల్లి మండలం మాధారంలో పోడు భూములను సందర్శించి పోడుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సాగులో ఉన్న పోడు భూములన్నింటినీ సర్వే చేయాలని ఆదేశాలు ఇచ్చినా స్థానిక అటవీశాఖ అధికారులు మాత్రం కుంటిసాకులు చెబుతూ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. సాగుదారుల భూముల్లో అటవీ అధికారులు అక్రమంగా మొక్కలు నాటారని, పేదల నుంచి భూములు గుంజుకోవాలని చూస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.